## క్లుప్తంగా

### ఏఓగా లక్ష్మీకుమారి బాధ్యతల స్వీకరణ

కంది(సంగారెడ్డి): మండల వ్యవసాయ అధికారిగా లక్ష్మీకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ లోని వ్యవసాయ కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న ఏవీజీకె ప్రసాద్ రామచంద్రపురం మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మీకుమారి మాట్లాడుతూ పంటల సాగులో రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సూచనలు, సలహాలు అందజేసేందుకు కృషి చేస్తానని వివరించారు.

### ఫార్మా కంపెనీల ఏర్పాటును విరమించుకోవాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల శివారులో ఫార్మా కంపెనీల ఏర్పాటు చేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని ఆయా గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయా గ్రామాల రైతులు పెద్ద ఎత్తున తహసీల్దార్ కార్యాలయానికి తరలి వచ్చి ఆందోళన చేపట్టారు. అనంతరం ప్రజావాణిలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, తమకు ప్రభుత్వం ఎలాంటి సమాచారం ఇవ్వకుండా భూములను సర్వే చేయించి వాటిని ఫార్మా కంపెనీల కోసం తీసుకునేందుకు చూస్తోందన్నారు. దానిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

### నిజాయితీ చాటుకున్న ఫొటోగ్రాఫర్


ఫోన్ అప్పగిస్తున్న పోలీసు అధికారులు

సంగారెడ్డి జోన్: పోగొట్టుకున్న ఫోన్‌ను వ్యక్తిని అప్పగించారు ఓ పోలీసు ఫొటోగ్రాఫర్. పట్టణంలోని పోలీసు ఫొటోగ్రాఫర్ చిరంజీవి ఉదయం సమయంలో కార్యాలయానికి వెళ్తున్నారు. రెడ్ల హోటల్ వద్ద రూ.30 వేలు విలువైన ఫోన్ పడి ఉండటం గమనించారు. దాన్ని స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐ యాదవ రెడ్డికి అప్పగించారు. అది సదాశివపేటలోని శాస్త్రినగర్ కాలనీకి చెందిన అరుణ్‌కుమార్‌దిగా గుర్తించారు. జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి అతనికి అప్పగించారు.

### వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

అమీన్‌పూర్, పటాన్‌చెరు పీఎస్‌ల పరిధిలో ఇద్దరు అదృశ్యమయ్యారు.


గౌస్

పటాన్‌చెరు టౌన్: కుమారుడి అదృశంపై తండ్రి ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ ఎస్‌టీఆర్ కాలనీకి చెందిన పఠాన్ కరీముల్లా కుమారుడు గౌస్ ఒక పంచర్ షాప్ లో పని చేస్తుంటాడు. ఈనెల 15న పనికి వెళ్తున్నానని చెప్పేసి వెళ్లి ఇంకా రాలేదు. దీంతో కుమారుడి కోసం తండ్రి స్థానికంగా, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.


సురేందర్

పటాన్‌చెరు టౌన్: బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకట్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని ఇంద్రేశంకు చెందిన సురేందర్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పని ఉందని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య సింధు కాల్ చేసి చూస్తే స్విచ్ ఆఫ్ అని వచ్చింది. ఆమె తెలిసిన వారి వద్ద స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పగలే విద్యుత్ వెలుగులు


ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వెలుగుతున్న దీపాలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): పట్టపగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. ఇందుకు విద్యుత్ అధికారులు పర్యవేక్షణ లోపమే కారణమని తెలుస్తోంది. ఫలితంగా విద్యుత్ వృథా అవుతోంది. ఇది ఎక్కడో కాదు.. సాక్షాత్తూ.. సదాశివపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోనే. ఇక్కడ పదుల సంఖ్యలో ఉన్న వీధి దీపాలు నిరంతరం వెలుగుతూ కనిపించాయి. దీంతో వందలాది యూనిట్లు విద్యుత్ వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు. వెంటనే ఈ వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

# అను'బంధం'


జోగిపేటలో..


నారాయణఖేడ్‌లో..


సదాశివపేటలో.. రాఖీలు కడుతున్న విద్యార్థులు


పటాన్‌చెరు టౌన్‌లో..

జిల్లావ్యాప్తంగా రాఖీ పండుగను అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు ఘనంగా జరుపుకొన్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీ కట్టి సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. ఒకరినొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. రక్తసంబంధీకులంతా ఒక చోట చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. ఆయా ప్రాంతాల్లో ప్రజా ప్రతినిధులు ఇంటింటా స్వీట్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు.

– నెట్‌వర్క్


సంగారెడ్డి టౌన్‌లో..


పటాన్‌చెరు టౌన్‌లో రాఖీ సంబురం


హత్నూరలో..


కల్హేర్‌లో..


వట్‌పల్లిలో..


రాయికోడ్‌లో...

### అభినందన


అభిషేక్‌కు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి అభిషేక్ సాంగ్విని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం హైదరాబాద్‌లో కలిసి అభినందనలు తెలిపారు. సాంగ్వి అభ్యర్థిత్వాన్ని పార్టీ ఖరారు చేయడం తెలిసిందే.

### చేప పిల్లల పంపిణీ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని గ్రామ పంచాయతీలకు సోమవారం ఎంపీడీఓ సురేష్ చేప పిల్లలను పంపిణీ చేశారు. దోమలను నివారించేందుకు మండలానికి 7,400 చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. ప్రతీ పంచాయతీకి 200 చొప్పున 37 పంచాయతీలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. తీసుకు వెళ్లిన గంబూసియా చేప పిల్లలను నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో, మురుగు కాల్వల వద్ద వదలాలని సిబ్బందికి సూచించారు. దోమ లార్వా, దోమలను తినేస్తాయన్నారు.

### భక్తుల సందడి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్, ముంగి, రాఘవాపూర్ గ్రామాల శివారులో గల సిద్ధివినాయక ఆలయం, ఆదిలక్ష్మి ఆశ్రమం, పంచవటి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. శ్రావణ సోమవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టేకూర్‌లోని మల్లికార్జున దేవాలయంలో దంపతులు పూజలు నిర్వహించారు.

# ఖాళీ స్థలాలు.. రోగాలకు నిలయాలు


సాయినగర్ కాలనీలోని ఖాళీ సలంలో నిల్వ ఉన్న మురుగు

- విషపురుగులు, దోమలకు ఆవాసాలు
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- వ్యాధుల బారిన ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

సదాశివపేట(సంగారెడ్డి): జిల్లాలోని పట్టణాల్లో నివాసాల నడుమ ఉన్న ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలు, చెత్త కుప్పలు, వ్యర్థాలు కంపచెట్లకు నిలయంగా మారాయి. అందులో సర్పాలు, విష పురుగులు, దోమలు స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. వాటి మూలంగా వ్యాధులు ప్రబలుతుండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మురుగు తోడై నీటి గుంటలుగా మారుతున్నాయి.

జిల్లాలోని సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, జోగిపేట, నారాయణఖేడ్, ఇస్నాపూర్, జిన్నారం, బొల్లారం, అమీన్‌పూర్, తెల్లాపూర్ తదితర పట్టణాల్లో చాలా ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను కొని నిర్మాణాలు చేపట్టకుండా వదిలేస్తున్నారు. అందులో మురుగు చేరడం కుంటలుగా మారడం జరుగుతోంది. కొన్నిచోట్ల పిచ్చిమొక్కలు మొలిచి చిన్నపాటి అడవులను తలిపిస్తున్నాయి. అందులో నుంచి ప్రజలపై దోమల దాడి చేస్తున్నాయి. పందుల సమూహం కూడా సంచారిస్తోంది. రాత్రి పూట పాములు, ఇళ్ల దగ్గరకు వస్తున్నాయి. వీటికి తోడు ఇప్పుడు కురుస్తున్న వర్షాలతో జ్వరాల బారిన పడుతున్నారు. రోజురోజుకూ బాధితుల సంఖ్య పెరుగుతుంది. దీంతో అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఖాళీ స్థలాలపై విస్తీర్ణాన్ని బట్టి పన్నులు వసూలు చేయాల్సిన మున్సిపల్ అధికారులు రాజకీయ నాయకులు, రియల్ వ్యాపారుల ఒత్తిడి కారణంగా అటు వైపు కన్నెత్తి చూడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఖాళీ స్థలాల్లో పేరుకు పోయిన చెత్తకుప్పలు, ముళ్ల కంపను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ఫయాజ్‌నగర్ కాలనీలో నిలిచిన నీరు, పెరిగిన పిచ్చిమొక్కలు

#### యజమానులపై చర్యలు తీసుకోవాలి



ఖాళీ ప్లాట్లు పరిశీలించి మురుగు, పిచ్చి మొక్కలు ఉన్న యజమానులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్లాట్లు పరిశుభ్రంగా ఉంచుకునేలా నోటీసులు ఇవ్వాలి ఒకవేళ స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– ఎం. తాజొద్దీన్
సీపీఐ జిల్లా కార్యదర్శివర్గసభ్యులు

#### ఫాగింగ్ చేయడం లేదు



మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, మలాథియాన్ మందు చల్లడం లేదు. దోమల నివారణకు కాల నీల్లో ఫాగింగ్ ఎక్కడా చేయడం లేదు. అందువల్ల ప్రజలు డెంగీ మలేరియా, విష జ్వరాల బారిన పడతున్నారు. అధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు చేపట్టాలి.

– ఎస్ శశిమోహన్‌గౌడ్, సదాశివపేట

#### చర్యలు తీసుకుంటాం



మున్సిపల్ పరిధిలో ఒక్కొక్క స్థలం పది మంది చేతులు మారుతోంది. స్థలం యజమాని ఎవరు అనేది ఆ ప్రాంతాల్లో వెళ్లి అడిగినా చెప్పడం లేదు. అయినా అందరిని గుర్తించి నోటీసులిస్తాం. ప్రజలు కూడా ఖాళీ స్థలాల్లో చెత్త వేయొద్దు. మున్సిపల్ చెత్త వాహనాల్లోనే వేయాలి.

– ఉమ, మున్సిపల్ కమిషనర్, సదాశివపేట

# మునిసిపల్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ


కార్మికుడికి సూచనలిస్తున్న కమిషనర్ జగ్జీవన్

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. తెల్లవారుజాము నుంచే పలువార్డుల్లో పర్యటించారు. రోడ్లు, వీధులు శుభ్రం చేస్తుండటాన్ని, ఇళ్ల నుంచి తడి, పొడి చెత్త సేకరిస్తున్న తీరును పరిశీలించారు. డ్రెయిన్‌ల నుంచి మురుగు తొలగింపును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య పనులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట శానిటరీ అధికారి శ్రీనివాస్ ఉన్నారు.

**రహదారులపై చెత్త వేస్తే చర్యలు**

రహదారులపై, దుకాణాల పక్కల గానీ ఎవరైనా దుకాణాదారులు చెత్త వేస్తే వారితో ఎత్తివేయించడంతోపాటు జరిమానా విధిస్తామని మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. పట్టణంలోని మద్యం దుకాణం పక్కన సోమవారం చెత్త వేసి ఉండటంతో యజమానితోనే చెత్త ఎత్తివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుకాణాల వద్దకు వచ్చే చెత్త తరలింపు ఆటోల్లోనే వేయాలని సూచించారు. రోడ్లపై, దుకాణాల సముదాయాల సమీపాల్లో ఇష్టానుసారం చెత్త పారవేస్తే చర్యలు తప్పవన్నారు.

# సోదరులకు రాఖీ కట్టిన వైద్యురాలు

**ఒకరు కెనడా.. మరొకరు స్థానికుడు**


ఇద్దరు సోదరులతో వైద్యురాలు

పటాన్‌చెరు టౌన్: తన ఇద్దరు సోదరులతో కలిసి ఓ వైద్యురాలు రాఖీ పండుగను ఘనంగా జరుపుకొన్నారు. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన అశ్విని ఎర్రగడ్డ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో జనరల్ సర్జన్. పటాన్‌చెరులో ఉంటున్న సోదరుడు రాజశేఖర్ ఇంటికొచ్చారు. ఇక్కడ నుంచి కెనడాలో ఉంటున్న సోదరుడికి ఆన్‌లైన్ వీడి యో కాల్ చేసి ఇక్కడ రాఖీ కడుతూ.. అక్కడ కూడా కట్టుకునేలా చేశారు. అనంతరం ముగ్గురున్న ఫొటో తీసుకున్నారు.

# ఫొటో.. మధుర జ్ఞాపకం

- కాంగ్రెస్ నేత మధు ముదిరాజ్


పటాన్‌చెరు టౌన్: కేక్ కట్ చేస్తున్న మధు

పటాన్‌చెరు టౌన్: ఒక్క ఫొటో ఎన్నో జ్ఞాపకాలను పంచుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఫొటోలు మనం సంతోషంగా ఉన్నప్పుడే కాదు.. మనతో లేనివారి జ్ఞాపకాలు కూడా పంచుతుందన్నారు. భవిష్యత్‌లో సైతం ఫొటో గ్రాఫర్లకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షుడు నరేందర్, ప్రధాన కార్యదర్శి సందీప్, లకోష్మరెడ్డి, రావి, వీరన్న, శంకర్, నారాయణరెడ్డి, వెంకటేశ్, మురళీ, శ్రీను, అనిల్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ ఫొటో గ్రఫీ, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు నాగుల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఉన్నత విద్య చదువుకున్న యువకులు ఉద్యోగాలు రాకపోవడంతో చాలా మంది ఫొటో గ్రాఫర్స్‌గా మారుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జయచింతన్, గౌరవాధ్యక్షుడు బిట్ల రాజు, కోశాధికారి కరుణాకర్, పీఆర్‌ఓ సత్తిబాబు, సలహాదారులు రాఘవేందర్, సభ్యులు దేవదాస్, మధు పాల్గొన్నారు.

#### జ్ఞాపకాలను బంధించడమే ఫొటోగ్రఫీ


సంగారెడ్డి పట్టణంలో..

సంగారెడ్డి టౌన్ : గడిచిపోయిన జ్ఞాపకాలను కూడా ఫొటోలో బంధించడమే ఫొటోగ్రఫీ అని సంగారెడ్డి ఫొటోగ్రాఫర్లు అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఐబీలో సంగారెడ్డి మండల ఫొటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మాటల్లో చెప్పలేనివి కళ్లకు కట్టినట్టుగా ఫొటో రూపంలో చూపించవచ్చన్నారు.

# 'పూర్వ' విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

జహీరాబాద్: మండలంలోని రంజోల్‌లో సోమవారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2004–05 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకున్నారు. రెండు దశాబ్దాల తర్వాత కలుసుకొని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు నాతుసింగ్, పూర్వ ఉపాధ్యాయులు రఘునందన్ రావు, శ్రీదేవి, నయీమొద్దీన్, ఇమ్రాన్, శ్రీశైలం, పూర్వ విద్యార్థులు రాములు, భీమ్‌రావు, మచ్చేందర్, సంగీత, రంజిత, అనిత పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ **ప్రత్యేక పూజలు**

మునిపల్లి(అందోల్): రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో దేవతామూర్తులకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండురంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతామూర్తులతో పాటు జీవన్ముక్త మహారాజ్‌కు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహారాజ్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. మక్తక్యాసారం ఆత్మానందాశ్రమంలో గురుమూర్తులకు పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

◆ **గాయత్రీదేవికి పూజలు**

జహీరాబాద్ టౌన్: బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో సామూహిక శ్రావణి ఉపకర్మ జరిగింది. శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమిని జంధ్యాల పౌర్ణమిగా బ్రాహ్మణులు చెబుతారు. ఈ సందర్భంగా సామూహిక శ్రావణి ఉపకర్మ నిర్వహించి పూజలు చేశారు. గాయత్రి దేవికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజం సేవా సంస్థ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

◆ **పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..**

నారాయణఖేడ్ మార్కండేయ భవన్‌లో స్థానిక పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నూలు పౌర్ణిమ పురస్కరించుకుని యజ్ఞోపవీత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గణపతిపూజ, హోమం, యజ్ఞోపవీత ధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఖేడ్ పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పద్మశాలీలు పాల్గొన్నారు.

◆ **వేడుకలు**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెంకటాపూర్‌లో సామూహిక జంధ్యా ధారణ వేడుకలను నిర్వహించారు. పద్మశాలీ సంఘం భవనంలో భక్త మార్కండేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీలతోపాటు నూలు నేసిన రోజుకు గుర్తుగా కొత్త జంధ్యాలను వేసుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గున్నాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **శివాలయాలు కిటకిట**

పటాన్‌చెరు టౌన్: శ్రావణ సోమవారం కావడంతో పటాన్‌చెరు పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. డివిజన్ పరిధిలోని పాత టోల్‌గేట్.. రామలింగేశ్వర స్వామి దేవస్థానం, జే.పీ కాలనీలోని ఉమామహేశ్వర దేవస్థానం, చైతన్ నగర్ కాలనీ.. మహాదేవుని ఆలయంలో ఆలయ అర్చకులు ఉదయం 5 గంటల నుంచి స్వామివారికి రుద్రాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. అనంతరం దేవతామూర్తులను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# గిరిధర్‌రెడ్డి సన్మాన సభ నేడు


ఎస్.గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసి మొదటి సారిగా జహీరాబాద్‌కు వస్తున్న ఎస్.గిరిధర్‌రెడ్డికి మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, టీఎస్ఐఐసీ చైర్మన్ నిర్మలారెడ్డి, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డి, టీఎస్ఐడీసీ మాజీ చైర్మన్ ఎండీ.తన్వీర్‌లు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ర్యాలీ, ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సన్మాన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీ చైర్మన్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.